# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ గురువారం 08 జనవరి 2026 | www.balagamtv.com | పేజీలు 4


## 10వ తరగతి విద్యార్థులకు స్నాక్స్

- ఫిబ్రవరి 16 నుంచి మార్చి 10 వరకు ..

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

పదవ తరగతి చదువుతూ వార్షిక పరీక్షల కోసం సాయంత్రం వేళల్లో నిర్వహించే ప్రత్యేక తరగతులకు హాజరయ్యే విద్యార్థులకు స్నాక్స్ అందించనున్నారు. ఫిబ్రవరి 16వ తేదీ నుంచి మార్చి 10వ తేదీ వరకు 19 పని దినాల్లో ప్రతి రోజు సాయంత్రం ప్రత్యేక తరగతుల సందర్భంగా వీటిని ఇవ్వనున్నారు. ఈ మేరకు రాష్ట్రంలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మోడల్ స్కూళ్ల (సమగ్ర శిక్ష పరిధిలోనివి)లలో స్నాక్స్ కోసం వినియోగించేలా రూ.4.23 కోట్ల నిధుల్ని సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్, పాఠశాల విద్య డైరెక్టర్ డాక్టర్ ఇ.నవీన్ నికోలస్ మంజూరు చేశారు. ఈ మేరకు నిధులను జిల్లాలవారీగా పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని స్టేట్ ఫైనాన్స్ కంట్రోలర్ ను కోరారు. దీంతో రాష్ట్రంలోని 4,303 ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలలతో పాటు మోడల్ స్కూళ్లలో 1,48,461 మంది విద్యార్థులకు స్నాక్స్ అందించనున్నారు. ప్రతి విద్యార్థికి ఒక రోజు యూనిట్ కాస్ట్‌గా రూ. 15 నిర్ణయించారు. 19రోజులకు రూ.4,23,11,385ను ఖర్చు చేయనున్నారు.

# మున్సిపల్ ఎన్నికలకు రంగం సిద్ధం

- ఉన్నతాధికారులతో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణికుముదిని వీడియో కాన్ఫరెన్స్
- ఈ నెల 20లోగా నోటిఫికేషన్ విడుదలకు అవకాశం




**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు రంగం సిద్ధమవుతోంది. ఈ నెల 20వ తేదీలోగా ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశముందని అధికార వర్గాలు వెల్లడించాయి. అందుకు అనుగుణంగా ప్రభుత్వం, రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) కసరత్తును ప్రారంభించాయి.

ఈ నేపథ్యంలో మున్సిపల్ ఎన్నికలపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణికుముదిని బుధవారం ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన కీలక అంశాలపై చర్చించారు. బ్యాలెట్ బాక్సుల ఏర్పాటు, ఎన్నికల సిబ్బంది నియామకం తదితర అంశాలపై కూడా సమీక్ష నిర్వహించారు.

ఇప్పటికే జిల్లా, మండల స్థాయిలో రాజకీయ పార్టీలతో సమావేశాలు నిర్వహించిన రాష్ట్ర ఎన్నికల సంఘం, గురువారం రాజకీయ పార్టీల రాష్ట్ర స్థాయి ప్రతినిధులతో సమావేశం కానుంది. ఎన్నికల నిర్వహణపై పార్టీల అభిప్రాయాలు, సూచనలు తీసుకునే ఉద్దేశంతో ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

తెలంగాణలో గడువు ముగిసిన 117 మున్సిపాలిటీల పాలకవర్గాలకు ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఎన్నికల ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారులను ఆదేశించింది.



## చీఫ్ మినిస్టర్స్ కప్ పోస్టర్ ఆవిష్కరణ

### 8 నుంచి టార్చ్ ర్యాలీ.. గ్రామం నుంచి రాష్ట్ర స్థాయి వరకు క్రీడా పోటీలు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఈ నెలలో జరగనున్న క్రీడా పోటీలకు సంబంధించిన చీఫ్ మినిస్టర్స్ కప్‌ఉ2025 (2వ ఎడిషన్) పోస్టర్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం ఆవిష్కరించారు. ఈ క్రీడా పోటీలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఈ నెల 8వ తేదీ నుంచి 17వ తేదీ వరకు పది రోజులపాటు టార్చ్ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఈ క్రీడా పోటీలు పలు దశల్లో జరగనున్నాయి. ఈ నెల 17 నుంచి 22వ తేదీ వరకు గ్రామ స్థాయిలో, 28 నుంచి 31వ తేదీ వరకు మండల స్థాయిలో, ఫిబ్రవరి 3 నుంచి 7వ తేదీ వరకు నియోజకవర్గ స్థాయిలో, ఫిబ్రవరి 10 నుంచి 14వ తేదీ వరకు జిల్లా స్థాయిలో, ఫిబ్రవరి 19 నుంచి 26వ తేదీ వరకు రాష్ట్ర స్థాయిలో పోటీలు నిర్వహించనున్నారు. డిసెంబర్ నెలలో జరగాల్సిన ఈ క్రీడలు వివిధ కారణాల వల్ల వాయిదా పడినట్లు అధికారులు తెలిపారు. గ్రామం నుంచి రాష్ట్ర స్థాయి వరకు మొత్తం 44 రకాల క్రీడల్లో శాట్స్ ఆధ్వర్యంలో ఈ పోటీలను నిర్వహించనున్నారు. యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ప్రభుత్వం వెల్లడించింది. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో మంత్రి వాకిటి శ్రీహరి, శాట్స్ చైర్మన్ శివసేనా రెడ్డి, స్పెషల్ సీఎస్ జయేష్ రంజన్, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాస రాజు, ఎస్ఏటీజీ ఎండీ సోనీబాల తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఓటర్ జాబితాపై అభ్యంతరాలను పరిష్కరించాలి

- రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని.



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

మున్సిపల్ ఓటర్ జాబితాపై అభ్యంతరాలు, ఫిర్యాదులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని అధికారులను ఆదేశించారు. మున్సిపల్ ఓటర్ జాబితా తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లు, అధికారులతో రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించగా, జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరయ్యారు. జిల్లాల వారీగా ఓటరు జాబితాల పై వచ్చిన అభ్యంతరాల వివరాలను సమీక్షించారు.

ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని మాట్లాడుతూ, ఈ నెల 12 వ తేదీ నాడు వార్డుల వారిగా ఫోటో ఎలక్టరోల్స్ జాబితా ప్రచురించడంతోపాటు, 13వ తేదీన డ్రాఫ్ట్ పోలింగ్ కేంద్రాలను ప్రచురిస్తామని తెలిపారు. 16వ తేదీన తుది పోలింగ్ కేంద్రాల వివరాలను ప్రచురించి, పోలింగ్ కేంద్రాల వారిగా ఫోటో ఎలక్టరోల్స్ ప్రచురిస్తామని వెల్లడించారు. అభ్యంతరాలు, ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో పారదర్శకంగా పరిశీలించి, పరిష్కరించాలని ఆదేశించారు. పట్టణాలలో వార్డుల వారీగా డ్రాఫ్ట్ ఓటరు జాబితా జనవరి 1వ తేదీన విడుదల చేశామని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో సీపీఓ శ్రీనివాసాచారి, మున్సిపల్ కమిషనర్లు ఖదీర్ పాషా, అన్వేష్, కలెక్టరేట్ పర్యవేక్షకులు ప్రవీణ్, టీపీఓ లు అన్సార్, సాయి కృష్ణ, మెప్మా ఏవో మీర్జా

### 13 నుంచి 15 వరకు

## సికింద్రాబాద్‌లో అంతర్జాతీయ కైట్ ఫెస్టివల్

- టూరిజం ప్రమోషన్‌కు ప్రత్యేక కార్యక్రమాలు
- 16 నుంచి 18 వరకు హాట్ ఎయిర్ బెలూన్ ఫెస్టివల్
- 16, 17 తేదీల్లో డ్రోన్ షో
- మంత్రి జూపల్లి కృష్ణారావు




**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా రాష్ట్ర టూరిజాన్ని ప్రోత్సహించే ఉద్దేశంతో సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో జనవరి 13 నుంచి 15 వరకు నిర్వహించనున్న అంతర్జాతీయ కైట్ ఫెస్టివల్ వివరాలను పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు వెల్లడించారు. డా.బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో అధికారులతో కలిసి ఆయన ఈ కార్యక్రమాలపై సమీక్షించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్ర టూరిజాన్ని అంతర్జాతీయ స్థాయిలో ప్రమోట్ చేసేందుకు ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 'సెలబ్రేట్ ది స్కై' నినాదంతో సంక్రాంతి వేడుకల్లో భాగంగా ఇంటర్నేషనల్ కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్‌ను అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ ఫెస్టివల్‌లో 19 దేశాలకు చెందిన 40 మంది అంతర్జాతీయ కైట్ ఫ్లయర్స్, దేశంలోని 15 రాష్ట్రాల నుంచి 55 మంది జాతీయ స్థాయి కైట్ ఫ్లయర్స్ పాల్గొననున్నట్లు వెల్లడించారు. కల్చర్ లాంగ్వేజ్ ఇండియన్ కనెక్షన్స్ సహకారంతో నిర్వహించే మిఠాయిల ఉత్సవంలో ఇతర రాష్ట్రాలు, దేశాల నుంచి వచ్చి హైదరాబాద్‌లో స్థిరపడిన వారు తమ ఇళ్లలో తయారు చేసిన సుమారు 1,200 రకాల మిఠాయిలు, తెలంగాణ సంప్రదాయ పిండి వంటలను 60 స్టాళ్లలో అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు. అదేవిధంగా 100 చేనేత, హస్తకళల స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి వివరించారు. తెలంగాణ సాంస్కృతిక కార్యక్రమాలు కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయని చెప్పారు.

జనవరి 16 నుంచి 18 వరకు హాట్ ఎయిర్ బెలూన్ ఫెస్టివల్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఐరోపా దేశాలకు చెందిన ప్రతినిధులతో అంతర్జాతీయ స్థాయి బెలూన్ల ప్రదర్శన ఉంటుందని, ఉదయం వేళ హైదరాబాద్ శివార్లలో, సాయంత్రం సమయంలో పరేడ్ గ్రౌండ్స్‌లో 'నైట్ గ్లో బెలూన్ షో' నిర్వహించనున్నట్లు వెల్లడించారు. బెలూన్ విహారానికి ఆసక్తి ఉన్నవారు బుక్‌మైషో వంటి ఆన్‌లైన్ ప్లాట్‌ఫాంల ద్వారా బుకింగ్ చేసుకోవాలని సూచించారు. అలాగే జనవరి 16 నుంచి 17 వరకు గచ్చిబౌలి స్టేడియంలో అత్యాధునిక డ్రోన్లతో మెగా డ్రోన్ షో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇది భారతీయ సాంస్కృతిక వారసత్వం నుంచి ఆధునిక ఆవిష్కరణల వరకు సాగిన ప్రయాణాన్ని ప్రతిబింబిస్తుందని చెప్పారు. చెరువుల పరిరక్షణే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం హైడ్రా ఆధ్వర్యంలో పునరుజ్జీవింపజేసిన బాగ్ అంబర్‌పేటలోని బతుకమ్మ కుంట, కూకట్‌పల్లిలోని నల్ల చెరువు, మాదాపూర్‌లోని తమ్మిడికుంట, రాజేంద్రనగర్‌లోని నేషనల్ పోలీస్ అకాడమీ సమీపంలోని బమ్ రుకున్ ఉద్ దౌలా చెరువుల వద్ద కూడా పతంగుల పండుగను నిర్వహించనున్నట్లు మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు.

## తెలంగాణలో 20 మంది ఐపీఎస్‌ల బదిలీ

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ రాష్ట్రంలో 20 మంది ఐపీఎస్ అధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది. నాలుగు కమిషనరేట్ల పరిధిలో కొత్తగా ఏర్పాటు చేసిన జోన్లకు డీసీపీలను కేటాయిస్తూ ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. పరిపాలనా అవసరాల దృష్ట్యా ఈ బదిలీలు చేపట్టినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

**బదిలీ అయిన ఐపీఎస్ అధికారులు వీరే..**

దక్షణ రేంజ్ అదనపు కమిషనర్ ఆఫ్ పోలీస్‌గా తఫ్సీర్ ఇక్బాల్
ఉత్తర రేంజ్ జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్‌గా శ్వేత
స్పెషల్ బ్రాంచ్ జాయింట్ సీపీగా విజయ్ కుమార్
కూకట్‌పల్లి డీసీపీగా రితిరాజ్
చేవెళ్ల డీసీపీగా యోగేశ్ గౌతమ్
మహేశ్వరం జోన్ (ఫ్యూచర్ సిటీ కమిషనరేట్) డీసీపీగా నారాయణ రెడ్డి
ఎల్బీనగర్ డీసీపీగా అనురాధ
ఉప్పల్ జోన్ డీసీపీగా సురేశ్ కుమార్
సికింద్రాబాద్ డీసీపీగా. రక్షిత
కుత్బుల్లాపూర్ డీసీపీగా ఎన్. కోటి రెడ్డి
చార్మినార్ జోన్ డీసీపీగా కిరణ్ ప్రభాకర్
శేరిలింగంపల్లి డీసీపీగా సీహెచ్ శ్రీనివాస్
మల్కాజిగిరి జోన్ డీసీపీగా శ్రీధర్
ఖైరతాబాద్ జోన్ డీసీపీగా శిల్పవల్లి
రాజేంద్రనగర్ డీసీపీగా శ్రీనివాస్
గోల్కొండ జోన్ డీసీపీగా చంద్ర మోహన్
జూబ్లీహిల్స్ జోన్ డీసీపీగా రమణా రెడ్డి
శంషాబాద్ జోన్ డీసీపీగా రాజేశ్
షాద్‌నగర్ జోన్ (ఫ్యూచర్ సిటీ కమిషనరేట్) డీసీపీగా శిరీష
సిద్దిపేట కమిషనర్ ఆఫ్ పోలీస్‌గా సాధనా రష్మీ పెరుమాళ్

కొత్తగా ఏర్పాటైన జోన్లలో పోలీసు వ్యవస్థను మరింత పటిష్టం చేయడమే లక్ష్యంగా ఈ బదిలీలు చేపట్టినట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

## ఫోన్‌ట్యాపింగ్ కేసులో సీఎం సోదరుడికి నోటీసులు

- మాజీ ఎమ్మెల్యేలు జైపాల్‌యాదవ్, చిరుమర్తి లింగయ్యలకు
- ఎమ్మెల్సీ నవీన్‌రావు తండ్రి కొండల్‌రావు, ఎమ్మెల్యే మాధవరపు కృష్ణారావు కుమారుడికి కూడా..
- విచారణకు రావాలంటూ...

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

ఫోన్‌ట్యాపింగ్ కేసులో దూకుడు పెంచిన సిట్ అధికారులు మాజీ ఎమ్మెల్యేలు జైపాల్‌యాదవ్, చిరుమర్తి లింగయ్యలకు నోటీసులు జారీ చేశారు. అలాగే ముఖ్యమంత్రి సోదరుడు కొండల్‌రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్‌రావు తండ్రి కొండల్‌రావు, కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరపు కృష్ణారావు కుమారుడు సందీప్‌లకు కూడా తమ ఎదుట విచారణకు హాజరు కావాలంటూ సిట్ అధికారులు నోటీసులు పంపారు. ఈ కేసులో ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావును విచారించాక రెండు రోజులు విరామం తీసుకున్న సిట్ అధికారులు.. ఈ కేసులో రాజకీయ కోణం నుంచి కూడా విచారణను ప్రారంభించినట్టు తెలిసింది. ఒకరోజు ముందు ఎమ్మెల్సీ నవీన్‌రావును విచారించిన అధికారులు తాజాగా జైపాల్‌యాదవ్, చిరుమర్తి లింగయ్యలను విచారించడానికి రంగం సిద్ధం చేసుకున్నారు. ఫోన్‌ట్యాపింగ్ కేసులో ఉన్న అధికారులతో వీరిద్దరికి ఉన్న సంబంధాలపై సిట్ అధికారులు క్షుణ్ణంగా ఆరా తీయనున్నట్టు తెలిసింది. అదే సమయంలో ఫోన్‌ట్యాపింగ్ వ్యవహారంలో బాధితుడైన ముఖ్యమంత్రి సోదరుడు కొండల్‌రెడ్డి నుంచి కూడా మరింత సమాచారాన్ని తీసుకునే అవకాశమున్నదని సమాచారం. కొండల్‌రెడ్డి వద్ద ఈ వ్యవహారానికి సంబంధించి పలు కీలకాంశాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉన్నదని తెలుస్తోంది. ఇక నవీన్‌రావు తండ్రి కొండల్‌రావు, ఎమ్మెల్యే కృష్ణారావు కుమారుడు సందీప్‌ల నుంచి కూడా జరిగిన ఫోన్‌ట్యాపింగ్ వ్యవహారంపై తమకు అవసరమైన సమాచారాన్ని తీసుకోవడానికి అధికారులు ప్రశ్నావళిని సిద్ధం చేసుకొని ఉన్నారని సమాచారం. నిజానికి వీరిద్దరు కూడా బుధవారమే విచారణకు హాజరు కావాల్సి ఉండగా, కారణాంతరాల వల్ల తాము గురువారం వస్తామని సమాచారం ఇచ్చినట్టు తెలుస్తోంది.

## 18, 19 తేదీల్లో మేడారంకు సీఎం



- మేడారం జాతరకు రూ.250 కోట్లతో అభివృద్ధి పనులు
- మంత్రులు పొంగులేటి, సీతక్క

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

హైదరాబాద్ తర్వాత ఆ స్థాయిలో రెండో నగరంగా వరంగల్ నగరాన్ని అభివృద్ధి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదని,. మేడారం జాతరకు రూ.250 కోట్లతో అభివృద్ధి పనులు చేస్తున్నట్టు రెవెన్యూ, హౌసింగ్, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. బుధవారం హనుమకొండ కలెక్టరేట్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 6 జిల్లాల కలెక్టర్లతో అభివృద్ధి కార్యక్రమాలను సమీక్షించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. మేడారం జాతరకు రూ.250 కోట్లతో సమ్మక్క, సారలమ్మ గద్దెల ప్రాంగణంతోపాటు పలు అభివృద్ధి కార్యక్రమాలు ఇప్పటికే 95 శాతం పూర్తయ్యాయన్నారు. రాబోయే 200 ఏండ్లపాటు ఈ నిర్మాణాలను ప్రజలు గుర్తుంచుకునేలా నిర్మిస్తున్నామన్నారు. ఈ నెల 18వ తేదీ సాయంత్రం సీఎం రేవంత్‌రెడ్డి మేడారంకు విచ్చేసి అక్కడే బస చేస్తారని, 19వ తేదీ ఉదయం గద్దెల ప్రాంగణం, పలు అభివృద్ధి కార్యక్రమాలను సీఎం ప్రారంభిస్తారని తెలిపారు. వరంగల్‌లో క్రికెట్ స్టేడియం, స్పోర్ట్స్ స్కూల్ నిర్మాణానికి డీపీఆర్‌ను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించినట్టు చెప్పారు. వరంగల్‌లో భూగర్భ డ్రయినేజీ నిర్మాణానికి రూ.4 వేల కోట్లకు పై చిలుకు నిధులకు పాలనాపరమైన అనుమతులు ఇచ్చినట్టు తెలిపారు. మొదటి దశ భూగర్భ డ్రయినేజీ పనులకు వారం రోజుల్లో టెండర్లు పిలవనున్నట్టు చెప్పారు. మరో రూ.570 కోట్లతో నగరంలో తాగునీటికి సంబంధించిన టెండర్లను పిలుస్తున్నట్టు తెలిపారు. వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద, రెవెన్యూ సిబ్బందిని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అభినందించారు. మామునూరు ఎయిర్‌పోర్టు భూ సేకరణ త్వరితగతిన పూర్తి చేసినందుకు వారిని మనస్ఫూర్తిగా రాష్ట్ర ప్రభుత్వం తరుపున అభినందనలు తెలిపారు. వరంగల్ నగరాన్ని హెల్త్‌హబ్‌గా మార్చే ప్రయత్నం చేస్తున్నామని, అందులో భాగంగానే వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని ఆదేశించామన్నారు. వరంగల్‌లో హౌసింగ్ బోర్డు ఆధ్వర్యంలో బీపీఎల్, బీపీఎల్ దిగువ శ్రేణి కుటుంబాలకు ఇండ్లను నిర్మించి ఇవ్వడానికి ఆదేశాలిచ్చామని తెలిపారు. నగరంలో ఇన్నర్ రింగ్ రోడ్డు పనులు పెండింగ్‌లో ఉన్నాయని, త్వరితగతిన భూ సేకరణ పూర్తి చేసి, పనులు పూర్తి చేయాలన్నారు. భద్రకాళి మాడవీధులు పూర్తిచేయడంతోపాటు భద్రకాళి దేవాలయాన్ని అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఇటీవల వరదలకు ముంపునకు గురైన మెగా టెక్స్‌టైల్స్ పార్క్ పరిసరాల్లో నివారణా చర్యలు తీసుకోవాలని ఆదేశాలిచ్చామన్నారు.

మేడారం జాతరకు ఈనెల 18న సీఎం విచ్చేసి 19వ తేదీన పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభిస్తారని, ఈ కార్యక్రమంతోపాటు జాతరను విజయవంతం చేయాలని ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలను మంత్రి ధనసరి అనసూయ సీతక్క కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి మేడారం జాతరను అత్యంత వైభవంగా నిర్వహించడానికి 6 నెలల ముందే రూ.100 కోట్లు విడుదల చేశారన్నారు. మాస్టర్‌ప్లాన్ విడుదల చేసి మేడారం అభివృద్ధికి దిశానిర్దేశం చేశారన్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీనివాస్‌రెడ్డి నిరంతరం సమీక్షిస్తూ పనులు వేగంగా జరిగేలా చర్యలు తీసుకున్నారంటూ ఈ సందర్భంగా ఆయనకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో సీఎం సలహాదారులు వేం నరేందర్‌రెడ్డి, మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్‌రెడ్డి, దొంతి మాధవరెడ్డి, కేఆర్ నాగరాజు, మురళీనాయక్, గండ్ర సత్యనారాయణరావు, వరంగల్, హనుమకొండ, జనగామ, మహబూబాబాద్, భూపాలపల్లి కలెక్టర్లు డాక్టర్ సత్యశారద, స్నేహ శబరీష్, రిజ్వాన్ బాషా, అద్వైత్‌కుమార్ సింగ్, రాహుల్ శర్మ, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నీటి విషయంలో రాజకీయాలు చేయొద్దు

- కిందికి వచ్చే నీళ్లకే అభ్యంతరం చెప్పడం అర్థరహితం
- ఏపీ సీఎం చంద్రబాబు

వివరాలు 2వ పేజీలో

## ముగ్గురు మంత్రులున్నా ఖమ్మంకు ఒరిగిందేమీ లేదు



- సీతారామసాగర్ ప్రాజెక్టును నిర్లక్ష్యం చేసిన కాంగ్రెస్
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**బలగం టీవి, ఖమ్మం**

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయినా ఖమ్మం జిల్లా అభివృద్ధికి చేసిందేమీ లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నప్పటికీ ప్రజలకు ఒరిగిందేమీ లేదని ఎద్దేవా చేశారు. ఇటీవల ఖమ్మం జిల్లాలో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో విజయం సాధించిన బీఆర్ఎస్ సర్పంచ్‌లతో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో కేటీఆర్ మాట్లాడారు.

ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేయాలనే లక్ష్యంతో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ సీతారామసాగర్ ప్రాజెక్టును చేపట్టి దాదాపు 90 శాతం పనులు పూర్తిచేశారని కేటీఆర్ గుర్తుచేశారు. ఖమ్మం జిల్లాలో 7.50 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలనే ఉద్దేశంతో పాటు గోదావరి జలాలపై జిల్లాకు పూర్తి హక్కులు దక్కేలా ఈ ప్రాజెక్టును డిజైన్ చేశారని తెలిపారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ప్రాజెక్టును పూర్తిగా నిర్లక్ష్యం చేసి గాలికి వదిలేసిందని ఆరోపించారు.

ఖమ్మం జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు కమిషన్లకు కక్కుర్తిపడి సీతారామసాగర్ ప్రాజెక్టును పక్కనపెట్టారని కేటీఆర్ మండిపడ్డారు. వారు ప్రజలకు మేలు చేసే నాయకులు కాదని, మోసగాళ్లని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. 30 శాతం చొప్పున కమిషన్లు వసూలు చేసి తమ జేబులు నింపుకోవడమే తప్ప జిల్లాకు ఉపయోగపడే ఒక్క పనీ చేయలేదని ఆరోపించారు.

ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నాయకులు 'ఈస్ట్‌మన్ కలర్ సినిమాలో చూపించినట్లుగా హామీల వర్షం కురిపించారని, అధికారంలోకి వచ్చి రెండేళ్లయినా వాటిలో ఒక్కటైనా అమలు చేయలేదని విమర్శించారు. ప్రభుత్వం ఈ రెండేళ్లలో చేసింది ఏదైనా ఉందంటే అది ఎగవేతలు, కూల్చివేతలు, పేల్చివేతలేనని కేటీఆర్ ఎద్దేవా చేశారు. అశ్వారావుపేట ప్రాంతంలో ఒక్క సీతారామసాగర్ ప్రాజెక్టు ద్వారానే 1.30 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేలా కేసీఆర్ ప్రణాళిక రూపొందించారని తెలిపారు. సత్తుపల్లి నియోజకవర్గంలో 40 వేల ఎకరాలకు, ఇల్లందు నియోజకవర్గంలో 20 వేల ఎకరాలకు, కొత్తగూడెం నియోజకవర్గంలో 10 వేల ఎకరాలకు, వైరా నియోజకవర్గంలో 20 వేల ఎకరాలకు నీరు అందించేలా ఈ ప్రాజెక్టును డిజైన్ చేశారని చెప్పారు. అయినప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం ఈ కీలక ప్రాజెక్టును పక్కనపెట్టిందని కేటీఆర్ విమర్శించారు.

### సీఎం సమక్షంలో

## కాంగ్రెస్‌లోకి ముగ్గురు బీఆర్ఎస్ కార్పొరేటర్లు



**బలగం టీవి, హైదరాబాద్**

ఖమ్మం కార్పొరేషన్‌లో బీఆర్ఎస్‌కు చెందిన ముగ్గురు కార్పొరేటర్లు బుధవారం సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ గూటికి చేరిపోయారు.బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కొత్తగూడెం పర్యటన చేపట్టిన రోజే...కార్పొరేటర్లు అధికార పార్టీ కండువా కప్పుకోవటం గమనార్హం. ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.కాంగ్రెస్‌లో చేరిన కార్పొరేటర్లు ధనియాల రాధ, తోట ఉమారాణి, రుద్రగాని శ్రీదేవి. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నేతృత్వంలో ఈ చేరికల కార్యక్రమం జరిగింది. ఇటీవలే ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన సీహెచ్. లక్ష్మి, జి. చంద్రకళ, డి. సరస్వతి, అమృతమ్మ, ఎం. శ్రావణి తదితర ఐదుగురు కార్పొరేటర్లు కూడా బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరిన సంగతి తెలిసిందే.

## కొత్త పార్టీ అవసరం లేదు

- శాసనమండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

కవిత కొత్త పార్టీపై తెలంగాణ శాసన మండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి స్పందిస్తూ రాష్ట్రంలో కొత్తగా పార్టీలు పెట్టాల్సినంత అవసరం లేదని వ్యాఖ్యానించారు. కొత్త పార్టీ వచ్చినా మనుగడ కష్టమని అభిప్రాయపడ్డారు. గతంలో వచ్చిన పలు రాజకీయ పార్టీలు కనుమరుగైన విషయాన్ని గుర్తు చేశారు. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విజ్ఞప్తి చేయడంతోనే ఆమె రాజీనామాను ఆమోదించినట్టు మండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి తెలిపారు. భావోద్వేగంతో రాజీనామా చేసినప్పుడు కొంతకాలం వేచిచూస్తామని చెప్పారు. కవిత విషయంలోనూ అదే చేశామని అభిప్రాయపడ్డారు. ఆమె అభీష్టమేరకే రాజీనామాను ఆమోదించి ఎన్నికల కమిషన్‌కు సమాచారం పంపినట్టు వివరించారు. గురువారం హైదరాబాద్‌లోని శాసనమండలిలోని తన కార్యాలయంలో మీడియాతో చిట్‌చాట్ చేశారు. ఏ ప్రాతిపదికన డీలిమిటేషన్ చేపడతారనే దానిపై స్పష్టత లేదని చెప్పారు. జనాభా ప్రాతిపదికన జరిగితే మాత్రం దక్షిణాది రాష్ట్రాలకు నష్టం చోటుచేసుకుంటుందని అన్నారు. హిల్ట్ విధానం ద్వారా ఎలాంటి అవినీతి జరగదని చెప్పారు. కాలుష్యం కట్టడికి పారిశ్రామిక భూముల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఉపాధి హామీ పథకంలో గాంధీ పేరు తొలగించడం సరికాదని చెప్పారు.

## కలమడుగులో గంగాజలం సేకరించిన మెస్రం వంశీయులు

**బలగం టీవి, హైదరాబాద్**

ఆదివాసుల ఆరాధ్యదైవం.. ప్రసిద్ధిగాంచిన గిరిజన నాగోబా జాతర ప్రారంభోత్సవానికి అవసరమయ్యే పవిత్ర గంగాజలం కోసం మెస్రం వంశీయుల పాదయాత్ర కొనసాగుతోంది. డిసెంబర్ 30వ తేదీన కేస్లాపూర్ నుంచి ప్రారంభమైన మహా పాదయాత్ర బుధవారం ఉదయానికి జన్నారం మండలంలోని కలమడుగు గోదావరి రేవుకు చేరుకుంది. గంగాజలం కోసం మెస్రం వంశీయులు చేపట్టిన పాదయాత్రలో 146 మంది పాల్గొన్నారు. పాదరక్షలు లేకుండా దాబోలి అటవీ ప్రాంతంలో రాళ్లు, రప్పలు, ముండ్ల పొదలు దాటుకుంటూ గంగాజలం తీసుకు వెళ్లడానికి వచ్చారు. ముందుగా మెశ్రం వంశీయులు స్నానాలు ఆచరించి గోదావరికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కటానా (వెండి చెంబు)లోకి గంగాజలాన్ని స్వీకరించారు. సహపంక్తి భోజనాల అనంతరం ఆ వెండి చెంబును కావడి కట్టుకొని బయలుదేరి వెళ్లారు. ఈ గోదావరి నీటితో నాగోబాను అభిషేకించిన అనంతరం కేస్లాపూర్ నాగోబా జాతర ప్రారంభమవుతుంది. కటోడ మెస్రం హనుమంతరావు, కోసేరావు, ప్రధాన్ దాదారావు, కొత్వాల్ తిరుపతి మాట్లాడుతూ.. తరతరాలుగా నాగోబా అభిషేకానికి అవసరమయ్యే గంగాజలం కోసం అడవి దారిగుండానే కాలినడకనే గుట్టల మీదుగా ప్రయాణం సాగిస్తున్నట్టు తెలిపారు. దైవబలమే తమను నడిపిస్తోందని చెప్పారు.

# విజిబుల్ పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించాలి..



- రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే.
- వార్షిక తనిఖీల్లో భాగంగా ఇల్లంతకుంట పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ

**బలగం టీవీ, ఇల్లంతకుంట:**

వార్షిక తనిఖీల్లో భాగంగా బుధవారం రోజున జిల్లా ఎస్పీ ఇల్లంతకుంట పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిసరాలు, వివిధ కేసుల్లో సీజ్ చేసిన వాహనాల వివరాలు,స్టేషన్ సంబంధించిన పలు రికార్డులను తనిఖీ చేసి,స్టేషన్ భౌగోళిక మ్యాప్ పరిశీలించి క్రైం హాట్స్పాట్స్ అడిగి తెలుసుకున్నారు.అనంతరం పెండింగ్ కేసులు, కోర్టు కేసులు,ప్రస్తుతం దర్యాప్తులో వున్న కేసులకు క్షుణ్ణంగా రివ్యూ చేసి అధికారులకు పలు ఆదేశాలు జారీ చేసి స్టేషన్ పరిధిలోని శాంతిభద్రతల పరిస్థితులు, నేరాల స్థితిగతులపై సవివరంగా అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు మరింత చేరువయ్యేలా పోలీస్ విధులు ఉండాలని, ప్రతి ఫిర్యాదుపై తక్షణమే స్పందించి బాధితులకు చట్టప్రకారం న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు.గతంతో పోలిస్తే నేరాల రేటు తగ్గుముఖం పట్టిందని తెలిపారు. కేసుల విచారణలో త్వరగతిన దర్యాప్తు,సాక్ష్యల సేకరణలో నిష్పక్షపాత దృక్పథం అవసరమని తెలిపారు.పోలీస్ స్టేషన్ అధికారులు, సిబ్బంది పనితీరు భేషుగ్గా ఉందని అభినందించారు.

పోలీస్ స్టేషన్ పరిసర ప్రాంతాల్లో 5ఎస్ విధానాన్ని పాటిస్తూ పరిశుభ్రతను కాపాడాలని,ఫైళ్లను క్రమపద్ధతిలో నిర్దేశిత ప్రదేశాల్లో ఉంచాలని, ప్రతి ఒక్కరు బాధ్యతాయుతంగా, క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని సూచించారు. పోలీస్ శాఖ వినియోగిస్తున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అధికారులు,సిబ్బందికి పూర్తి అవగాహన ఉండాలని తెలిపారు. సిబ్బందికి ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. పోలీస్ అధికారులు, సిబ్బంది తరచూ గ్రామాలు పర్యటిస్తూ ప్రజలతో సత్సంబంధాలు కొనసాగించాలని,అసాంఘిక కార్యకలాపాలు లేదా శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అంశాలపై వెంటనే సమాచారం అందించేలా ఇన్ఫర్మేషన్ వ్యవస్థను మరింత పటిష్టం చేయాలని ఆదేశించారు. అలాగే మహిళల భద్రత, సైబర్ నేరాల నివారణ, మాదక ద్రవ్యాల నిర్మూలన మరియు వాటి వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించాలని, యువతలో చట్టం పట్ల గౌరవం పెంపొందించేందుకు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఎస్పీ వెంట సి.ఐ మొగిలి, ఎస్.ఐ అశోక్, సిబ్బంది ఉన్నారు.



## ఘనంగా లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకలు

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకలను జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకలను నిర్వహించగా, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరై దివ్యాంగులతో కలిసి బ్రెయిలీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి, పంపిణీ చేశారు. పలువురు దివ్యాంగులను ఇంచార్జి కలెక్టర్ సన్మానించారు. లూయిస్ బ్రెయిలీ అందించిన సేవలను కొనియాడారు.

## చెక్కర కర్మాగారంలో బాయిలర్ పేలుడు

- ఇద్దరు కార్మికులు మృతి.. ఆరుగురికి తీవ్ర గాయాలు

**బలగం టీవీ, బెంగళూరు**

కర్ణాటక రాష్ట్రం బెలగావి జిల్లాలోని ఓ చక్కెర కర్మాగారంలో భారీ ప్రమాదం చోటుచేసుకుంది. కర్మాగారంలో బాయిలర్ పేలిన ఘటనలో ఇద్దరు కార్మికులు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. బైల్‌హొంగల్ తాలూకాలోని మరకుంబి గ్రామంలో ఉన్న ఇనామ్‌దార్ చ్చర కర్మాగారంలో బుధవారం మధ్యాహ్నం సుమారు 2 గంటల ప్రాంతంలో ఈ ప్రమాదం జరిగింది. అకస్మాత్తుగా బాయిలర్ పేలడంతో కర్మాగారంలో పనిచేస్తున్న కార్మికుల్లో భయాందోళనలు నెలకొన్నాయి. పేలుడు తీవ్రతకు బాయిలర్ నుంచి కరిగిన వేడి పదార్థం కార్మికులపై చిమ్మడంతో పలువురు తీవ్రంగా కాలిపోయినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనలో ఇద్దరు కార్మికులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, మరో ఆరుగురు తీవ్ర గాయాల పాలయ్యారు. గాయపడిన వారిలో నలుగురు పరిస్థితి విషమంగా ఉండటంతో వారిని మెరుగైన చికిత్స కోసం బెలగావిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

# నీటి విషయంలో రాజకీయాలు చేయొద్దు



- కిందికి వచ్చే నీళ్లకే అభ్యంతరం చెప్పడం అర్థరహితం
- ఏపీ సీఎం చంద్రబాబు కీలక వ్యాఖ్యలు

**బలగం టీవీ, అమరావతి**

ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పోలవరం ప్రాజెక్టు పనులను పరిశీలించిన అనంతరం అక్కడే మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా తెలంగాణతో నీటి వివాదాలపై సున్నితంగా, స్పష్టంగా స్పందిస్తూ నీటి విషయంలో రాజకీయాలు చేయొద్దని సూచించారు. గోదావరి నదిలో నీళ్లు పుష్కలంగా ఉన్నాయని, సముద్రంలోకి పోతున్న నీటిని ఎవరైనా వినియోగించుకోవచ్చని సీఎం చంద్రబాబు అన్నారు. పోలవరం ప్రాజెక్టుకు అభ్యంతరం చెప్పడం సరికాదని స్పష్టం చేశారు. "తెలుగు జాతి ఒక్కటే. ఇచ్చిపుచ్చుకునే ధోరణి ఉండాలి. రెండు రాష్ట్రాల మధ్య విరోధాలు పెరిగి ఇతరులు ఆనందించే పరిస్థితి రావొద్దు" అని తెలంగాణను ఉద్దేశించి హితవు పలికారు.

కొందరు చేస్తున్న వ్యాఖ్యలు చూస్తే ఆ రాజకీయాలేమిటో తనకే అర్థం కావడం లేదని చంద్రబాబు వ్యాఖ్యానించారు. గోదావరి నది పైభాగంలో దేవాదుల ప్రాజెక్టు ఉందని, అక్కడి నుంచి నీళ్లు వస్తే కింద ఉన్న పోలవరానికే చేరుతాయని చెప్పారు. కిందికి వచ్చే నీళ్లకే అభ్యంతరం చెప్పడం అర్థరహితమని స్పష్టం చేశారు. తాము ఎప్పుడూ దేవాదులకు వ్యతిరేకం కాలేదని, తెలంగాణ కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మిస్తున్నప్పుడు కూడా అభ్యంతరం చెప్పలేదని గుర్తు చేశారు. నీటిని పొదుపుగా వినియోగిస్తే తెలంగాణకూ లాభమేనని, మిగులు నీటిని శ్రీశైలం, నాగార్జునసాగర్‌లలో నిల్వ చేసుకోవచ్చని సూచించారు. కృష్ణా నదిలో నీళ్లు తక్కువగా ఉండటంతో పైన ప్రాజెక్టులు నిర్మిస్తే నష్టమని, కానీ గోదావరి డెల్టాను కాపాడుతూ కృష్ణాఉగోదావరి అనుసంధానం చేస్తే ఎలాంటి ఇబ్బంది ఉండదని అన్నారు.

రాయలసీమ ఎత్తిపోతలపై కొందరు చేస్తున్న వ్యాఖ్యల్లో అర్థం లేదని చంద్రబాబు విమర్శించారు. అబద్ధాలను వందసార్లు చెబితే నిజమవుతాయని అనుకుంటున్నారని ఎద్దేవా చేశారు. పోలవరం ప్రాజెక్టు ఆలస్యానికి గత వైసీపీ ప్రభుత్వమే కారణమని సీఎం ఆరోపించారు. వారి పాలన వల్లే ప్రాజెక్టు 6, 7 ఏళ్లు ఆలస్యమైందని, డయాఫ్రం వాల్ దెబ్బతిన్న విషయం ఐఐటీ హైదరాబాద్ నిపుణులు చెప్పిన తర్వాతే అప్పటి ప్రభుత్వానికి తెలిసిందని విమర్శించారు. ప్రస్తుతం కొత్తగా డయాఫ్రం వాల్ నిర్మిస్తున్నామని, ఫిబ్రవరి 15లోపు పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. వైసీపీ ప్రభుత్వ అక్రమాలపై దర్యాప్తు జరుగుతోందని, అయితే దర్యాప్తు పేరుతో కాలయాపన చేస్తే ప్రాజెక్టుల పూర్తి ఆలస్యమవుతుందని చెప్పారు. అనుమతులు లేని ప్రాజెక్టులకు రూ.2 వేల కోట్లు ఖర్చు పెట్టారని, ఎన్జీటీకి రూ.100 కోట్ల జరిమానా చెల్లించాల్సి వచ్చిందని తీవ్రంగా దుయ్యబట్టారు.

## హరీష్ రావును మర్యాదపూర్వకంగా కలిసిన టీజీపీ నేతలు

**బలగం టీవీ, సిద్దిపేట:**



బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేతగా నియమితులైన సిద్ధిపేట శాసనసభ్యులు తన్నీరు హరీష్ రావును బుధవారం సిద్ధిపేటలో పలువురు నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. తెలంగాణ గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్‌రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు చిలుముల జయవర్ధన్ హరీష్ రావును కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, చేనేత కండువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా హరీష్ రావుకు వారు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తూ హరీష్ రావును అభినందించారు. పార్టీలో ఆయనకు దక్కిన కీలక బాధ్యత పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పల్లె ఎల్లయ్య, నగునూరి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## లైవ్ స్ట్రీమింగ్ ఛాలెంజ్ ప్రాణం తీసింది

- పెయిడ్ వ్యూయర్స్ కోసం డ్రగ్స్, మద్యం సేవించి ఇన్‌ఫ్లుయెన్సర్ మృతి
- స్పెయిన్‌లో ఘటన

**బలగం టీవి, హైదరాబాద్**



సోషల్ మీడియాలో లైక్‌లు, వ్యూస్, డబ్బు కోసం చేసే ప్రమాదకర ఛాలెంజ్‌లు చివరకు ప్రాణాలకే ముప్పుగా మారుతున్నాయి. పెయిడ్ వ్యూయర్స్ కోసం లైవ్ స్ట్రీమింగ్‌లో డ్రగ్స్, మద్యం సేవించిన ఓ సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ ప్రాణాలు కోల్పోయిన ఘటన స్పెయిన్‌లో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

స్పెయిన్‌కు చెందిన 37 ఏళ్ల సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ సెర్గియో జిమెనెజ్ నెటిజన్ల నుంచి వచ్చే వివిధ రకాల ఆన్‌లైన్ ఛాలెంజ్‌లను స్వీకరిస్తూ వీడియోలు చేస్తుండేవాడు. న్యూఇయర్ సందర్భంగా ఆయన సోషల్ మీడియాలో లైవ్ స్ట్రీమింగ్ నిర్వహించాడు. ఈ సందర్భంగా పెయిడ్ వ్యూయర్స్ కోసం నిర్వహించిన ఓ ఛాలెంజ్‌లో భాగంగా ఆరు గ్రాముల కొకైన్‌తో పాటు ఒక బాటిల్ విస్కీ సేవిస్తానని ప్రకటించాడు. లైవ్‌లోనే ఆ ఛాలెంజ్‌ను పూర్తి చేశాడు. అయితే, కొద్దిసేపటికే సెర్గియో ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. డిసెంబర్ 31న తెల్లవారుజామున 2 గంటల ప్రాంతంలో అతడి తల్లి లేచి చూడగా సెర్గియో నేలపై పడిపోయి ఉండటాన్ని గమనించింది. ఎంత పిలిచినా స్పందించకపోవడంతో అనుమానం వచ్చి పోలీసులకు సమాచారం అందించింది. అక్కడికి చేరుకున్న పోలీసులు అతడు మృతి చెందినట్లు నిర్ధారించి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పోలీసుల ప్రాథమిక విచారణలో గతంలో కూడా సెర్గియో లైవ్ స్ట్రీమింగ్‌ల్లో డబ్బుల కోసం డ్రగ్స్ తీసుకున్నట్లు వెల్లడైంది. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. సోషల్ మీడియాలో పాపులారిటీ, డబ్బు కోసం ఇలాంటి ప్రమాదకర ఛాలెంజ్‌లు స్వీకరించడం ఎంతవరకు సమంజసం అని నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు. లైక్‌లు, వ్యూస్ మోజులో ప్రాణాలకే ముప్పు తెచ్చుకోవడం దురదృష్టకరమని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

## కేపీహెచ్‌బీలో ఆలయంలో చోరీ కలకలం

**బలగం టీవి, హైదరాబాద్**

హైదరాబాద్ నగరంలో ఆలయ చోరీ ఘటన కలకలం రేపింది. కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్ పరిధిలోని సర్దార్‌పటేల్‌నగర్‌లో ఉన్న శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో దొంగలు భారీ చోరీకి పాల్పడి భక్తుల్లో ఆందోళన కలిగించారు. అర్ధరాత్రి వేళలో దుండగులు ఆలయంలోకి చొరబడి గర్భగుడి తాళాలను పగులగొట్టి స్వామివారి వెండి ఆభరణాలను ఎత్తుళ్లినట్లు తెలుస్తోంది. దొంగిలించబడిన వెండి నగల విలువ సుమారు రూ.50 లక్షలు ఉంటుందని ఆలయ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ ఘటన ఉదయం ఆలయం తెరిచిన అనంతరం వెలుగులోకి వచ్చింది. గుడి సిబ్బంది, స్థానికులు గమనించి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న కేపీహెచ్‌బీ పోలీసులు తక్షణమే ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. దొంగలు ఆలయంలోకి ఎలా ప్రవేశించారు, ఏ మార్గంలో పారిపోయారు అనే అంశాలపై క్లూస్ సేకరిస్తున్నారు. సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలిస్తూ, డాగ్ స్క్వాడ్‌ను రంగంలోకి దింపి గాలింపు చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. దొంగలను త్వరలోనే పట్టుకుంటామని పోలీసులు తెలిపారు. హైదరాబాద్‌లో ఇటీవలి కాలంలో ఆలయాల్లో చోరీలు పెరుగుతుండటంతో స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆలయాల చుట్టూ భద్రతను మరింత కట్టుదిట్టం చేయాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు రాత్రి వేళల్లో గస్తీని పెంచాలని కోరుతున్నారు.

## బీఆర్ఎస్ గెలవాలని వైసీపీ కార్యకర్తలు కోరుకుంటున్నారు

- మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

**బలగం టీవీ, అమరావతి**

ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి గురుఉశిష్యులని పేర్కొంటూ, అందుకే ఏపీలో వైసీపీ గెలవాలని బీఆర్ఎస్ కార్యకర్తలు, తెలంగాణలో బీఆర్ఎస్ విజయం సాధించాలని వైసీపీ కార్యకర్తలు కోరుకుంటున్నారని వైసీపీ మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. బుధవారం మీడియాతో మాట్లాడిన కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, 90 శాతం మంది వైఎస్ఆర్‌సీపీ కార్యకర్తలు తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వం ఉండాలని కోరుకుంటున్నారని తెలిపారు. అదే విధంగా ఏపీలో జగన్ ప్రభుత్వం కొనసాగాలని బీఆర్ఎస్ కార్యకర్తలు ఆకాంక్షస్తున్నారన్నారు. మాజీ సీఎం జగన్‌తో కేసీఆర్, కేటీఆర్‌కు ముందునుంచే మంచి సంబంధాలు ఉన్నాయని ఆయన వ్యాఖ్యానించారు. వైసీపీ కార్యకర్తలపై ఏపీలో కూటమి ప్రభుత్వం అక్రమంగా కేసులు పెడుతోందని కేతిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. అదే తరహాలో తెలంగాణలో కూడా రేవంత్ రెడ్డి ప్రభుత్వం బీఆర్ఎస్ కార్యకర్తలపై అక్రమ కేసులు నమోదు చేస్తోందని ఆరోపించారు.

## రెండు దొంగతనం కేసుల్లో నిందితుడికి జైలు శిక్ష..

- సిరిసిల్ల పట్టణ సి.ఐ. కృష్ణ



**బలగం టీవీ, సిరిసిల్ల:**

సిరిసిల్ల పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన రెండు దొంగతనం కేసుల్లో నిందితుడికి ఒక కేసులో 7 నెలలు, ఒక కేసులో 6 నెలల జైలు శిక్ష విధిస్తూ సిరిసిల్ల ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ మంగళవారం తీర్పు వెల్లడించినట్లు సిరిసిల్ల పట్టణ సి.ఐ. కృష్ణ తెలిపారు.

సి.ఐ. మాట్లాడుతూ.. సిరిసిల్ల పట్టణ పరిధిలోని సర్దార్ నగర్‌లో గల హనుమాన్ ఆలయంలో 21.05.2025 రాత్రి గుర్తు తెలియని వ్యక్తి ఆలయానికి చెందిన ఇనుప పైపులు దొంగిలించి హుండీ తాళం పగలగొట్టి ప్రయత్నం చేయగా ఆలయ సమీప నివాసితులు అప్రమత్తమై అతడిని పట్టుకుని పోలీసులకు అప్పగించి బొట్ల సుదర్శన్ పిర్యాదు మేరకు అప్పటి ఎస్సై మురళీధర్ గౌడ్ కేసు నమోదు చేయడం జరిగింది. అదే విధంగా సిరిసిల్ల పట్టణ పరిధిలోని సిద్దులవాడలో సిద్ధుల దశరథం నూతనంగా నిర్మించుకోగా నూతన ఇంటిలో 21.05.2025 రాత్రి అక్రమంగా చొరబడి ఎలక్ట్రికల్ వైరింగ్ ను కట్ చేసి దొంగతనానికి పాల్పడాగ అట్టి ఇంటి యజమాని పిర్యాదు మేరకు అప్పటి ఎస్సై మురళీధర్ గౌడ్ కేసు నమోదు చేసి దర్యాప్తులో భాగంగా పై రెండు దొంగతనలలో రేబర్తి గ్రామం (మద్దూర్ మండలం, సిద్దిపేట జిల్లా) కు చెందిన వజ్జల కొమురయ్య (గా/శీ సత్తయ్య)ను నిందుతునిగా గుర్తించి అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినంతరం కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. కోర్టు విచారణలో సీ.ఎం.ఎస్.ఎస్.ఐ. శ్రావణ్ ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ వేముల నరేష్ ద్వారా రెండు కేసుల్లో ఎనిమిది మంది సాక్షలను ప్రవేశపెట్టగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ చెలుమల సందీప్ వాదనలు వినిపించారు.కేసు పూర్వాపరాలను పరిశీలించిన న్యాయమూర్తి ప్రవీణ్ నిందితుడు వజ్జల కొమురయ్య కు ఒక కేసులో 7 నెలల జైలు శిక్ష, మరో కేసులో 6 నెలల జైలు శిక్ష విధిస్తూ తీర్పు ప్రకటించారని పట్టణ ఇన్స్పెక్టర్ కృష్ణ తెలిపారు.

## ఐబొమ్మ రవి బెయిల్ పిటిషన్ కొట్టివేసిన నాంపల్లి కోర్టు..

**బలగం టీవీ, హైదరాబాద్**



పైరసీ వెబ్‌సైట్ ఐ బొమ్మ నిర్వాహకుడు రవికి నాంపల్లి కోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. తనపై నమోదైన ఐదు కేసుల్లో బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ అతను దాఖలు చేసిన పిటిషన్‌ను కోర్టు ఈరోజు కొట్టివేసింది. ప్రస్తుతం కేసు విచారణ కీలక దశలో ఉందని, ఈ సమయంలో నిందితుడికి బెయిల్ ఇవ్వడం సరైనది కాదని తెలిపారు. కేసు దర్యాప్తు జరుగుతుందని, రవికి ఇతర దేశాల్లో పౌరసత్వం ఉందని, ఒకవేళ బెయిల్ మంజూరు చేస్తే అతను విదేశాలకు పారిపోయే అవకాశం ఉందని పోలీసులు తమ వాదనలను వినిపించారు. పోలీసుల వాదనలతో ఏకీభవించిన నాంపల్లి కోర్టు, నిందితుడు విదేశాలకు వెళ్లే ప్రమాదం ఉందని భావించి రవి దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించింది.

## గ్రామస్తులకు నీటి సమస్య తీర్చిన సర్పంచ్ శ్రీనివాస్.

**బలగం టీవీ, బోయినిపల్లి:**



రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం తడగొండ గ్రామంలో గత కొన్ని రోజులుగా త్రాగు నీటి బావి మోటార్ చెడిపోయి, తాగునీటి సమస్య ఉండడంతో ఇటీవల నూతనంగా ఎన్నికైన సర్పంచ్ ఉయ్యాల శ్రీనివాస్ తడగొండ గ్రామ గాజుల బావి మోటార్ పాడైపోయినా విషయం తెలుకుకొని, ఊరి ప్రజలు నీటితో ఇబ్బందులు పడకూడదని, కొత్త (నూతన) మోటార్ తీసుకువచ్చి మోటార్ ను బిగించి, గ్రామస్థులకు నీటి సమస్య తీర్చారు.



## ప్రభుత్వ పాఠశాల బలోపేతానికి గ్రామస్తులు సహకరించాలి..

- సర్పంచ్ ఏనుగుల కనుకయ్య

**బలగం టీవీ, బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం విలాసాగర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి గ్రామస్తులు సహకరించాలని సర్పంచ్ ఏనుగుల కనకయ్య కోరారు. మంగళవారం రోజున గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయగా, సర్పంచ్ ఏనుగుల కనకయ్య ఉపసర్పంచ్ సుజాత, వార్డు సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఎంఈఓ శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో మంచి విద్య బోధన అందిస్తున్నామని, విద్యార్థుల సంఖ్య పెంచేలా చూడాలని సర్పంచ్ ఏనుగుల కనకయ్య కోరారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఏనుగుల కనకయ్య మాట్లాడుతూ.. ప్రస్తుతం గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో ప్రాథమిక పాఠశాలలో తక్కువ సంఖ్యలో విద్యార్థులు ఉన్నారని, గ్రామస్తులు అందరు సహకరించి, ప్రైవేట్ పాఠశాలల వరకు చూడకుండా, ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి, ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలోనే మంచి విద్య అందుతుందని, విద్యార్థుల భవిష్యత్తు తీర్చిదిద్దేందుకు ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి సహకరించాలని కోరారు. వచ్చే విద్యా సంవత్సరంలో 200 పైగా విద్యార్థులను చేర్పించేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, ప్రైమర్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు మల్లేశం, సుంకపాక చక్రవర్తి, వార్డు సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## చిల్డ్రన్ హోం నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి..

- ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్
- వృద్ధుల ఆశ్రమం సందర్శన, పండ్ల పంపిణీ



**బలగం టీవీ, తంగళ్ళపల్లి:**

చిల్డ్రన్ హోం భవన నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. తంగళ్ళపల్లి మండలం మండేపల్లి పరిధిలో టీజీఈడబ్ల్యూఐడీసీ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న చిల్డ్రన్ హోం నిర్మాణ పనులను ఇంచార్జి కలెక్టర్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ ప్లాన్, పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. పనుల్లో వేగం పెంచాలని, నిర్ణీత గడువులోగా పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని ఇంచార్జి కలెక్టర్ ఆదేశించారు.

**త్యాగరాజస్వామి ఆరాధన ఉత్సవాలకు తీసుకువెళ్ళండి..**

తంగళ్ళపల్లి మండలం మండేపల్లిలోని ప్రభుత్వ వృద్దుల ఆశ్రమంలోని వృద్దులను వేములవాడలో నిర్వహించనున్న త్యాగరాజ స్వామి ఆరాధన ఉత్సవాలకు తీసుకువెళ్లాలని జిల్లా సంక్షమ అధికారి లక్ష్మరాజంకు ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. తంగళ్ళపల్లి మండలం మండేపల్లిలోని ప్రభుత్వ వృద్దుల ఆశ్రమాన్ని ఇంచార్జి కలెక్టర్ బుధవారం సందర్శించారు. ముందుగా ఆవరణ, వసతి గదులు, వంట గది, సామగ్రి పరిశీలించారు. ఈ సందర్భంగా వృద్దులకు పండ్లు పంపిణీ చేశారు. ప్రతి రోజూ టిఫిన్, భోజనం, ఆరోగ్య అంశాలపై వృద్ధులను అడిగి తెలుసుకున్నారు. మొత్తం ఎందరు వృద్దులు ఆశ్రయం పొందు తున్నారో ఆరా తీసారు. 37 మంది ఉన్నారని ఇంచార్జి కలెక్టర్ దృష్టికి జిల్లా సంక్షమ అధికారి తీసుకువెళ్లారు. అనంతరం ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడారు. వృద్దుల సంరక్షణ పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, వైద్య శాఖ వద్ద ఉన్న పాలియేటీవ్ కేర్ వాహన సేవలు వృద్దుల కోసం వినియోగించాలని సూచించారు. వృద్దులను విహార యాత్రలకు తీసుకువెళ్లాలని పేర్కొన్నారు. ఈ పరిశీలనలో జిల్లా సంక్షమ అధికారి లక్ష్మరాజం, మండేపల్లి సర్పంచ్ గాధగోని సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులే దేశానికి ఆస్తి



- విద్యార్థులు ఆరోగ్యంగా ఉన్నప్పుడే విద్యలో మెరుగైన ఫలితాలు సాధించవచ్చు.
- సైబర్ నేరాల పట్ల విద్యార్థి దశ నుండే చైతన్యం అవసరం
- ఉన్నత లక్ష్యలను ఎంచుకొని కష్టపడి చదివితేనే విజయాలు సాధ్యమవుతాయి.
- జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే
- ముస్తాబాద్‌లో మెగా వైద్య శిబిరం

**బలగం టీవీ, ముస్తాబద్:**

ముస్తాబద్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో శ్రీ తిరుమల నర్సింగ్ హెూమ్ వారి సౌజన్యంతో ముస్తాబద్ మండల పరిధిలోని గ్రానూ పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం జరిగింది. ఈ ఉచిత వైద్య శిబిరాన్ని జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే ఐపీఎస్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. విద్యార్థులు శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉన్నప్పుడే చదువులో మెరుగైన ఫలితాలు సాధించగలరని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే ఐపీఎస్ పేర్కొన్నారు. ముస్తాబాద్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో, శ్రీ తిరుమల నర్సింగ్ హెూమ్ సౌజన్యంతో ముస్తాబాద్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల (గ్రానూ) లో ఏర్పాటు చేసిన మెగా ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎస్పీ మహేష్ బి.గితే మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుండే ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, ఉన్నత లక్ష్యలను ఎంచుకొని క్రమశిక్షణతో కష్టపడి చదివితేనే విజయాలు సాధ్యమవుతాయని హితవు పలికారు. ప్రస్తుత కాలంలో విద్యార్థులను వేధిస్తున్న రక్తహీనత మరియు కంటి సమస్యలను గుర్తించి, తగిన వైద్యం అందించడానికే ఈ శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నేటి డిజిటల్ యుగంలో పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల విద్యార్థులు చైతన్యవంతులు కావాలని ఎస్పీ సూచించారు. కృత్రిమ మేధ ఆధారిత వీడియో కాల్స్, సందేశాల పట్ల జాగ్రత్తగా ఉండాలి. అపరిచిత వ్యక్తులతో స్నేహం వద్దు, వ్యక్తిగత విషయాలను సామాజిక మాధ్యమాల్లో పంచుకోవద్దు. ఒకవేళ సైబర్ మోసానికి గురైతే, వెంటనే 1930 హెల్ప్ లైన్ నెంబర్‌కు ఫిర్యాదు చేయాలి. మోసపోయిన మొదటి గంట లో స్పందిస్తే పోగొట్టుకున్న డబ్బు తిరిగి వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుందని వివరించారు. ఈ వైద్య శిబిరంలో వైద్య నిపుణులు విద్యార్థులకు సాధారణ ఆరోగ్య పరీక్షలతో పాటు కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టిన శ్రీ తిరుమల నర్సింగ్ హెూమ్ యాజమాన్యాన్ని, సురభి వైద్య విజ్ఞాన సంస్థ సిబ్బందిని ఎస్పీ అభినందించారు. ఈ కార్యక్రమంలో సి.ఐ మొగిలి, ఎం.ఇ.ఓ రాజిరెడ్డి, ఎస్.ఐ గణేష్, డాక్టర్లు చంద్రశేఖర్ రావు, శ్రీకాంత్, అనురాధ, స్రవంతి, పాఠశాల ఉపాధ్యాయ బృందం, ప్రజాప్రతినిధులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## ముందస్తుగా సంక్రాంతి ముగ్గుల పోటీలు..

- సర్పంచ్ ఏనుగుల కనుకయ్య ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు
- ఉత్సాహంగా పాల్గొన్న మహిళలు



**బలగం టీవీ, బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం విలాసాగర్ హైస్కూల్లో సర్పంచ్ ఏనుగుల కనకయ్య ఆధ్వర్యంలో అల్ఫోర్స్ ఆదినేత నరేందర్ రెడ్డి సహకారంతో ముగ్గుల పోటీలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున మహిళలు పాల్గొని, ఉత్సాహంగా రంగురంగుల ముగ్గులను తెలుగు సంస్కృతి ఉట్టి పడేలా ముగ్గులు వేశారు.దాదాపు 50 మంది మహిళలు పాల్గొని, ముగ్గులను వేశారు.ఇందులో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేశారు. పాల్గొన్న ప్రతి ఒక్కరికి కన్సోలేషన్ బహుమతులు అందజేశారు. సర్పంచ్ ఏనుగుల కనుకయ్య ను ఉపసర్పంచ్ సుజాత ను పలువురు సన్మానించారు.

ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి గెలిపించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.ముగ్గుల పోటీలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాల బలోపేతానికి గ్రామ ప్రజలు సహకరించి, విద్యార్థుల సంఖ్య పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి శ్రావణ్ కుమార్, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, ప్రైమరీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు మల్లేశం, సుంక పాక చక్రవర్తి, వార్డు సభ్యులు, అంగన్వాడి టీచర్లు, మహిళలు, యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి చేయాలి..

- ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్.
- ఆపరేషన్ స్మైల్ పోస్టర్ల ఆవిష్కరణ.



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ఆయా శాఖల అధికారులు కలిసికట్టుగా కృషి చేయాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. జిల్లా సంక్షమ శాఖ ఆధ్వర్యంలో ఆపరేషన్ స్మైల్ ఉ 2026 సమావేశాన్ని జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో బుధవారం నిర్వహించగా, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ నెల 01 వ తేదీ నుంచి 31వ తేదీ వరకు ఆపరేషన్ స్మైల్ ఉ 2026 కార్యక్రమాన్ని నిర్వహించనున్న సందర్భంగా పోస్టర్లను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రతి ఏడాది జనవరి, జూలై నెలల్లో ఆపరేషన్ స్మైల్ కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని తెలిపారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, కార్మిక శాఖ, పోలీస్ శాఖ అధికారులు సంయుక్తంగా తనిఖీలు చేయాలని ఆదేశించారు. జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ ప్రాంతాల్లో 18 ఏండ్లలోపు పిల్లలు భిక్షటన, వివిధ పనుల్లో ఉండకూడదని స్పష్టం చేశారు. ఎవరైనా కనిపిస్తే వెంటనే సమీప విద్యాలయాల్లో చేర్పించాలని సూచించారు. ప్రభుత్వ వసతి గృహాల్లో అడ్మిషన్ ఇప్పించాలని పేర్కొన్నారు. ఎక్కడా బాల కార్మికులు కనిపించకూడదని తెలిపారు. బడీడు పిల్లలు కచ్చితంగా బడిలోనే ఉండాలని స్పష్టం చేశారు. పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ చంద్రయ్య, డీఆర్డీఓ గీత, చైల్డ్ ప్రొటెక్షన్ చైర్మెన్ చంద్రయ్య, జిల్లా సంక్షమ శాఖ అధికారి లక్ష్మరాజం, జిల్లా వైద్యాధికారి రజిత, కార్మిక శాఖ అధికారి నజీర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరా మహిళా శక్తి భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి..



- ఐఎంఎస్ భవన నిర్మాణ పనుల పరిశీలన.
- మహిళా దినోత్సవంలోగా అందుబాటులోకి తీసుకురావాలి
- ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

ఇందిరా మహిళా శక్తి (ఐఎంఎస్) భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని ప్రభుత్వ వైద్య కళాశాల సమీపంలో రూ. ఐదు కోట్ల నిధులతో పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న ఇందిరా మహిళా శక్తి (ఐఎంఎస్) భవన నిర్మాణ పనులను బుధవారం ఇంచార్జి కలెక్టర్ పరిశీలించారు. ముందుగా భవన నిర్మాణ ప్లాన్ లను పరిశీలించారు. గ్రౌండ్ ఫ్లోర్, ఫస్ట్ ఫ్లోర్ స్లాబ్ పూర్తి కాగా, గోడల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. అన్ని గదులు పరిశీలించి.. ఎప్పటిలోగా పూర్తి అవుతాయో ఆరా తీశారు. పనుల పురోగతిని నిత్యం పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. భవన పనుల కోసం కార్మికుల సంఖ్యను పెంచి మార్చి 08వ తేదీలోగా పూర్తి చేయాలని ఈఈ పీఆర్ సుదర్శన్ రెడ్డిని ఇంచార్జి కలెక్టర్ ఆదేశించారు. ఈ పరిశీలనలో జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు భాగ్య, డీఆర్డీఓ గీత, ఈఈ పీఆర్ సుదర్శన్ రెడ్డి, తహసీల్దార్ మహేష్ కుమార్, ఏఈ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# శివరాత్రిలోగా జంక్షన్ అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

- ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్.
- రగుడు జంక్షన్ అభివృద్ధి పనుల పరిశీలన.



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని రగుడు జంక్షన్ అభివృద్ధి పనులు రానున్న శివరాత్రిలోగా పూర్తి చేయాలని మున్సిపల్ అధికారులను ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. రూ. 3 కోట్ల 10 లక్షలతో సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని రగుడు జంక్షన్ అభివృద్ధి పనులు కొనసాగుతుండగా, ఇంచార్జి కలెక్టర్ బుధవారం పరిశీలించారు. జంక్షన్ సుందరీకరణ, గ్రీనరీ, డివైడర్ల ఏర్పాటు, విద్యుత్ దీపాలు, హైమాస్ట్ లైట్ల పనులు కొనసాగిస్తున్నారు. ఆయా పనులను ఇంచార్జి కలెక్టర్ పరిశీలించారు. పనుల్లో వేగం పెంచాలని, రానున్న శివరాత్రి వేడుకలకు సిద్ధం చేసి అందుబాటులోకి తీసుకురావాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు.ఈ పరిశీలనలో మున్సిపల్ డీవైఈఈ వాణి, ఏఈ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.




# 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' ట్రైలర్ విడుదల

**బలగం టీవి, హైదరాబాద్**

మాస్ మహారాజా రవితేజకు ఇప్పుడు ఒక గట్టి హిట్ అత్యవసరంగా మారింది. ఈ నేపథ్యంలో ఆయన ఆశలన్నీ తాజాగా రూపొందుతున్న 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' సినిమాపైనే నిలిచాయి. కిశోర్ తిరుమల దర్శకత్వంలో తెర్కెక్కిన ఈ చిత్రం సంక్రాంతి కానుకగా జనవరి 13న ప్రేక్షకుల ముందుకు రానుంది. విడుదల తేదీ సమీపిస్తుండటంతో సినిమా ప్రమోషన్లు శరవేగంగా సాగుతున్నాయి. తాజాగా ఈ సినిమా ట్రైలర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఇద్దరు భామల మధ్య చిక్కుకున్న వ్యక్తిగా రవితేజ తనదైన కామెడీ టైమింగ్‌తో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాడు. ట్రైలర్ ప్రస్తుతం మంచి స్పందనను తెచ్చుకుంటుండగా, అభిమానులు ఈ సినిమా హిట్ అవుతుందనే నమ్మకాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఇది రవితేజ కెరీర్‌లో 76వ చిత్రం కావడం విశేషం. ఈ సినిమాలో రవితేజ సరసన ఆషికా రంగనాథ్, డింపుల్ హయాతి హీరోయిన్లుగా నటిస్తున్నారు. సునీల్, సత్య, వెన్నెల కిశోర్, సుధాకర్, మురళీధర్ గౌడ్ తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. బీమ్స్ సిసిరిలియో సంగీతం అందించగా, ఏ. శ్రీకర్ ప్రసాద్ ఎడిటింగ్ బాధ్యతలు చేపట్టారు. ప్రసాద్ మూరేళ్ల సినిమాటోగ్రఫీ నిర్వహించారు. ఎస్ఎల్వీ సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి ఈ చిత్రాన్ని నిర్మించారు.

# ది రాజాసాబ్ టికెట్ ధరల పెంపు

**బలగం టీవి, హైదరాబాద్**

సంక్రాంతి సందర్భంగా ప్రేక్షకుల ముందుకు రానున్న ప్రభాస్ తాజా చిత్రం 'ది రాజాసాబ్'పై భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రభాస్ కథనాయకుడిగా తెరకెక్కిన ఈ చిత్రం విడుదల కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో టికెటఇగ్ ధరల పెంపు విషయంలో చిత్రబృందానికి ఊరట లభించింది. ఇప్పటికే తెలంగాణ హైకోర్టు నుంచి అనుమతి పొందిన మూవీ టీమ్‌కు తాజాగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా ధరలు పెంచుకునేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు ఏపీ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. జనవరి 8న సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 12 గంటల మధ్య ప్రదర్శించే స్పెషల్ షోలకు టిటిట్ ధరపై ఏకంగా రూ.1000 వరకు పెంచుకునే వెసులుబాటు కల్పించింది. అలాగే జనవరి 9 నుంచి పదిరోజుల పాటు టిటిట్ ధరలు పెంచుకునేందుకు అనుమతినిచ్చింది.

పెరిగిన ధరల వివరాలు ఇలా ఉన్నాయి... సింగిల్ స్క్రీన్ థియేటర్లలో టిటిట్ ధరపై రూ.150 (పన్నులతో కలిపి), మల్టీప్లెక్స్‌లలో రూ.200 (పన్నులతో కలిపి) పెంచుకునే అవకాశం కల్పించింది. అదనంగా రోజుకు ఐదు షోలను ప్రదర్శించేందుకు కూడా ప్రభుత్వం అనుమతి ఇచ్చింది.




# రాజన్న సిరిసిల్ల జిల్లాలో యూరియా కొరత లేదు..

- ఇప్పటిదాకా 12 వేల మెట్రిక్ టన్నులు పంపిణీ చేసాము
- వ్యవసాయ అధికారులను రైతులు సంప్రదించాలి.
- ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

రాజన్న సిరిసిల్ల జిల్లాకు అవసరమైన సరిపడా యూరియా నిల్వలు ఉన్నాయని, కొరత లేదని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ప్రస్తుతం 2వేల మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని తెలిపారు. ఇప్పటివరకు జిల్లాకి 21 వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా, ఇప్పటి దాకా 12 వేల మెట్రిక్ టన్నులు రైతులకు పంపిణీ చేశామని తెలిపారు. మరో రెండు వేల మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని వెల్లడించారు. అవసరానికి యూరియా సరఫరా కూడా క్రమం తప్పకుండా అందుతుందని స్పష్టం చేశారు యూరియా పంపిణీపై సంబంధిత అధికారులు, వ్యవసాయ శాఖ సిబ్బంది నిరంతరం పర్యవేక్షణ చేపడుతున్నారని తెలిపారు. కృత్రిమ కొరత సృష్టించడం, అధిక ధరలకు విక్రయించడం వంటి అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు ఎవరైనా యూరియా సరఫరాలో సమస్యలు ఎదుర్కొంటే సమీప వ్యవసాయ అధికారులను సంప్రదించాలని సూచించారు. అవసరానికి మించి యూరియా కొనుగోలు చేయకుండా, శాస్త్రీయ పద్ధతిలో వినియోగించాలని రైతులను ఇంచార్జి కలెక్టర్ కోరారు. కొందరు సోషల్, ఇతర మాధ్యమాల్లో ప్రచారం చేస్తున్న అసత్య ప్రచారాలు నమ్మవద్దని సూచించారు. పంటల సాగుకు అనుగుణంగా ఎరువులు అందుబాటులో ఉంటాయని వెల్లడించారు.



# ఒక ముఠాగా ఏర్పడి బెదిరింపులకు పాల్పడనుకున్న నలుగురు వ్యక్తుల అరెస్ట్..



- 9ఎఎ పిస్టల్, 5 రౌండ్స్ స్వాధీనం
- వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

ఎస్పీ మాట్లాడుతూ రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన తోకల శ్రీకాంత్, దాసరి తిరుపతి, పయ్యావుల గోవర్ధన్, జగిత్యాల జిల్లాకు చెందిన మంజరి సురేందర్ అనే నలుగురు వ్యక్తులు ముఠాగా ఏర్పడి జనశక్తి కార్యకలాపాల పేరుతో బెదిరింపులకు గురి చేయడం,డబ్బు వసూలు చేయడం, భూ వివాదాలలో జోక్యం చేసుకోవడం లాంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలలో పాల్గొనడానికి ప్రయత్నిస్తున్నారన్న నమ్మదగిన సమాచారం మేరకు తంగళ్లపల్లి గ్రామ శివారులో వాహనాల తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన వీరిని ఆపి తనిఖీ చేయగా వీరి వద్ద ఒక్కటి 9ఎఎ పిస్తోల్, 05 రౌండ్స్ ఉండగా వాటిని స్వాధీన పర్చుకొని నలుగురు నిందితులను అరెస్ట్ చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. ప్రజలను బెదిరించడం, అక్రమ కార్యకలాపాలకు పాల్పడడం వంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని, చట్టవిరుద్ధ కార్యకలాపాల్లో పాల్గొనే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. ఎస్పీ వెంట సిరిసిల్ల రూరల్ సి.ఐ మొగిలి, టాస్కోఫర్స్ సి.ఐ నటేష్,స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రవి, ఎస్.ఐ ఉపేంద్రచారి, సిబ్బంది ఉన్నారు.



# సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నివారణపై అవగాహన కార్యక్రమం..

- ఉల్లంఘించిన వారికి జరిమానాలు.

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

స్వచ్ఛ సర్వేక్షన్ 2025 లో భాగంగా సిరిసిల్ల మున్సిపాలిటీ పరిధిలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని అరికట్టే దిశగా వివిధ వాణిజ్య వ్యాపార ప్రాంతాల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించబడినవి. నిషేధిత సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులు వినియోగిస్తున్న మరియు విక్రయిస్తున్న వ్యాపారులపై జరిమానాలు విధించబడినవి. ఈ సందర్భంగా వ్యాపార వర్గాలు, దుకాణదారులకు ప్లాస్టిక్ వల్ల పర్యావరణానికి, ప్రజారోగ్యానికి కలిగే నష్టాలపై అవగాహన కల్పించడంతో పాటు, పర్యావరణహిత ప్రత్యామ్నాయాలను వినియోగించాల్సిన అవసరాన్ని తెలియజేస్తూ అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ కిరణ్ ఆధ్వర్యంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొని, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధ నిబంధనలను వివరించారు. పునరావృతంగా నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సిరిసిల్లను శుభ్రంగా నిలుపుకోవడానికి సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను పూర్తిగా నివారించి, గుడ్డ సంచులు, కాగితపు కవర్లు వంటి పర్యావరణహిత పదార్థాలను వినియోగించాలని మున్సిపాలిటీ అధికారులు వ్యాపారులకు మరియు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.